# शिव शक्ति






संपादिका





सह - संपादन

# पुस्तक के सहयोगी रचनाकार



Available at amazon

MAKE IN INDIA

YouTube





geetaprakashan7@gmail.com

**गीता प्रकाशन**

बुक्सवाला

हैदराबाद - लखनऊ दिल्ली



978-93-342-3676-7

249/-

# शिव शक्ति

संपादिका

**श्रीमती अरूणा अग्रवाल**

सह - संपादन

अनिता भणावत

डॉ. टी. कविता

**गीता प्रकाशन**

बुक्सवाला

हैदराबाद - लखनऊ - दिल्ली

| | | |
|---|---|---|
| प्रथम संस्करण | : | March 2025 |
| सामग्री कॉपीराइट | : | संबंधित रचना के रचनाकार स्वयं |
| प्रकाशक | : | गीता प्रकाशन बुक्सवाला<br>4-2-771, रामकोट चौरस्ता,<br>हैदराबाद 500001 तेलंगाना भारत<br>सेल : 98492 50784<br>geetaprakashan7@gmail.com |
| ISBN | : | 978-93-342-3676-7 |

## लेख / ARTICLE


*Mrs. Aruna Agrawal* ... *7*

*- Lord Shiv ji*

*Neeru Rajan* ... *8*

*- Swami Vivekanand*

**पी. यादव 'ओज'** ... *9*

*- शिव ही सत्य है*

**दिनेश कमलेकर 'विनीत'** ... *10*

*- भगवान शिव के जन्म की पौराणिक कथा*

**प्रो. कमला मधुकरराव गणोरकर** ... *11*

*- शिव संकल्पमस्तु*

**डॉ. कृष्णा जोशी** ... *13*

*- शब्द शक्ति*

**ఎల్లూరి. అప్పల సత్యనారాయణ** ... *14*

- శ్రీకాళహస్తీశ్వర శతకములో శివ నామ మాహాత్మ్యము

**డా.ఎన్.సత్యనారాయణ** ... *19*

- భగవత్స్వరూపమే ఉగాది !


## कविता / Poems / కవిత


श्रीमती अरुणा अग्रवाल ... *25*

अनिता भणावत ... *26*

डॉ. टी. कविता ... *27*

सुषमा खजूरिया ... *28*

संगीता अग्रवाल ... *29*

साधना ठाकुर ... *30*

संजय कुमार पांडे ... *31*

शशि शर्मा ... *33*

डॉ. तपस्या चौहान ... *34*

डॉ. अनुसया गायकवाड ... *35*

डॉ. जय प्रकाश प्रजापति 'अंकुश कानपुरी' ... *36*

प्रो. बजरंग शंकर माळी ... *37*

दिनेश सिंह ... *38*

वी एन वी पद्मावती ... *39*

दिनेश कमलेकर 'विनीत' ... *40*

सुनीता प्रयाकर राव वासुनि ... *41*

अरुण कुमार साहू ... *42*

विकास त्यागी ... *43*

पुष्पलता साहू ... *44*

डॉ श्रीपूनम जोधपुरी ... *47*

कामिनी कौशिक ... *48*

अच्युत उमर्जी ... *50*



# శ్రీకాళహస్తీశ్వర శతకములో శివ నామ మాహాత్మ్యము

తెలుగు సాహిత్య చరిత్రలో రాజాశ్రయాన్ని పొంది 'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలకల్గెనో అతులిత మాధురీమహిమ' అన్న ప్రసిద్ధిని పొంది తదనంతర కాలంలో (బహుళ శ్రీకృష్ణ దేవరాయుల తదనంతరం) రాజసేవలనొల్లక ఐహిక సుఖాలకు రోసి విరాగియై రాజశేఖరుడైన శివుని సేవయే మోక్షసాధనమని నమ్మి తన హృదయాంతరంగాన్ని ఆ శ్రీకాళహస్తీశ్వరునికి నివేదించుకున్న భక్తకవి ధూర్జటి. ధూర్జటి రచించిన శ్రీ కాళహస్తీశ్వర శతకము భక్తి శతకాలలో విలక్షణమైనది.దీనిలో శివనామ మాహాత్మ్యాన్ని వెల్లడించే పద్యాలున్నాయి. వాటిని వివరించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

తెలుగులో మనకు విస్తారమైన శతక సాహిత్యం ఉన్నది. దీనిలో తొలి శతకంగా పాల్కురికి సోమనాధుని 'వృషాధిప శతకము'ను చెబుతారు. శతకాలకు

1. సంఖ్యానియమం
2. ముకుట నియమం వంటివి ప్రధానం.

శతక పద్యాలలో మకుటం ప్రధానంగా పద్యాల చివర ఉంటుంది. ఆదికవి నన్నయ్య రచించిన ఆంధ్రమహాభారతంలోనిజ 'ఉదంకోపాఖ్యానము' లో ఉదంకుడు చేసిన నాగస్తుతిలో 'మాకు ప్రసన్నుడయ్యెడున్' అని అంతమయ్యే నాలుగు పద్యాలు ఉన్నాయి. కనుక శతక రచనకు మార్గం చూపింది నన్నయే అని కొందరు భావించారు. నన్నయ తరువాత 12వ శతాబ్దంలో మల్లికార్జున పండితారాధ్యుడు 'శివతత్వ సారం' రచించాడు. దీనిలో ఒకే మకుటం కాకుండా 'శివా! రుద్రా! అజా!' అని వేరువేరు మకుటాలతో నాలుగైదు వందల పద్యాలు ముక్తకాలుగా రచించాడు. అందువలన దీనినే తెలుగులో తొలి శతకంగా మరికొంతమంది చెపుతున్నారు. పాల్కురికి

సోమనాథుడు కూడా 'శతకంబు శివ తత్వసారము దీపకళిక' అని 'శివతత్త్వసారం' ను ప్రశంసించాడు.శతక సాహిత్యంపై పరిశోధన గావించిన కె.గోపాలకృష్ణారావు గారు పేర్కొన్న శతక లక్షణాలు ముఖ్యంగా సంఖ్యా నియమం, మకుట నియమం, ముక్తకనియమం, చందో నియమం, ఆత్మాశ్రయ కవితానియమం, వంటివన్నీ ఉన్న పాల్కురికి సోమనాధుని 'వృషాధిప శతకము' నే తెలుగులో తొలి శతకముగా అందరూ అంగీకరిస్తున్నారు.

తెలుగులో శతకాలను

| | |
|---|---|
| 1. భక్తి | 6. రాజకీయ |
| 2. జ్ఞానం | 7. సాంఘిక |
| 3. శృంగార | 8. దృష్టాంత |
| 4. నైతిక | 9. నింద |
| 5. వైరాగ్య | 10.సంకీర్ణములుగా విభాగించారు. |

వీటిలో భక్తి శతకాలు భగవంతునితో భక్తుని(కవి)కి వున్న అనుబంధం - ఆత్మీయత, తాత్వికత, ఐహిక సుఖ నిరసనము, ముక్తి కాంక్ష, భావావేశాలు వంటి వాటిని వెల్లడించేవిగా ఉంటాయి.

భక్తి శతకాలలో ధూర్జటి శ్రీకాళ హస్తీశ్వర శతకము విశిష్టమైనది. రాజాశ్రయంలో భోగాలను అనుభవించిన ధూర్జటి ' వధూ నఖాగ్రములచే శరీరము కాయల్ గాచిపోగా ఐహిక సుఖాలపట్ల విరక్తుడై అంతా మిథ్య' అని తలంచాడు. 'రాజుల్మత్తులు వారి సేవ నరకప్రాయంబు' అని తెలుసుకున్నాడు. 'నీకుంగాక కవిత్వము నెవ్వరికీ నేనీ నంటూ' ప్రతినపూనాడు. జీవితాంతం శ్రీ కాళ హస్తీశ్వరునే త్రికరణ శుద్ధిగా నమ్మి అతని సేవలోనే తరించాడు.

భగవంతుని పట్ల భక్తునికి వున్న అనన్యమైన ప్రేమ, విశ్వాసాలను భక్తి అని అంటారు. భాగవతం మనకు నవవిధ భక్తి మార్గాలను తెలియజేసింది.

*శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాదసేవనం*

*అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనంచ*

అని శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము అనే 9 భక్తి మార్గాలను తెలియజేసింది. అయితే ఇందులో చాలా మార్గాలు కలియుగానికి సరిపడవు. కారణాన్ని కూడా భాగవతమే తెలియజేసింది. భాగవతంలో కలియుగంలో మానవులు

ఎలా ఉంటారో చెబుతూ

'అలసులు మందబుద్ధియుతులల్పతరాయువులుగ్ర రోగసం

కలితులు మందభాగ్యులు సుకర్మము చెయ్యవి సేయ జాలరీ

కలియుగమందు మానవులు ..........'

కలియుగంలో మానవులు మందబుద్ధులై, అల్పాయుష్కులై, సోమరులై, రోగ పీడితులై, మందభాగ్యులై సత్కర్మలేవీ చేయలేనివారై ఉంటారని పేర్కొంది. కాబట్టి కలిగియుగ మానవులకు నామ సంకీర్తనమే తరుణోపాయమని 'కలౌ నామ సంకీర్తనమ్" అని పేర్కొంది. కాబట్టి భక్తితో నామ సంకీర్తనం చేయడం ద్వారా మోక్షాన్ని పొందవచ్చునని ధూర్జటి త్రికరణ శుద్ధిగా నమ్మి శ్రీకాళ హస్తీశ్వరుని సేవించాడు.

శ్రీకాళ హస్తీశ్వర శతకంలో ధూర్జటి రాజనిరసనం, ఐహిక సుఖ నిరసనం వంటివి ఉన్నా శివ నామ మాహాత్మ్యాన్ని వర్ణించే పద్యాలను కూడా ప్రత్యేకంగా రచించాడు. ముఖ్యంగా

'నిప్పై పాతక తూలశైలమడచున్ నీనామమే మానవుల్

తప్పన్ దవ్వుల విన్న నంతక భుజాదర్పోద్ధత క్లేశముల్

తప్పుం దారును ముక్తులౌదురని శాస్త్రంబుల్ మహా పండితుల్

చెప్పంగా దమకింక శంక వలెనా శ్రీకాళ హస్తీశ్వరా' అని పేర్కొన్నాడు.

'శ్రీ కాళ హస్తీశ్వరా ! నీనామ మహత్త్వము ఇంతింత అని చెప్పలేము. నీనామమును విన్నంతనే ఆ విన్నవాని పాపరాశి కొండంతైనా దగ్ధమైపోవును. అంతేకాదు, దూరమునుంచి విన్నా, యథాలాపంగా విన్ననూ అలా విన్న వానికి యమబాధలుండవు. నీ పేరు ఉచ్చరించిన వారు స్వయంగా ముక్తి పొందుదురు. పండితులు, శాస్త్రములు ఈ విషయమే నొక్కి చెప్పుచుండగా ఇంకా సందేహమేలా' అని ఆశ్చర్య పడతాడు.

పునరపి జననం పునరపి మరణం

పునరపి జననీ జఠరే శయనం

ఇహ సంసారే బహుదుస్తారే

అని శంకర భగవత్ పాదులు పేర్కొన్నారు. మళ్లీ మళ్లీ జన్మించడం, మళ్లీ మరణించడం, మళ్లీ మళ్లీ మాతృగర్భంలో శయనించడం ఈ సంసార సముద్రం దాటరానిది. అయితే ఈ సంసార సముద్రాన్ని దాటించేది భగవన్నామ స్మరణే. ఆ

భగవంతుడు శివుడే అని ధూర్జటి త్రికరణ శుద్ధిగా నమ్మిఆ విషయాన్ని మనకు తెలియజేస్తున్నాడు.శివ నామ శ్రవణము దగ్గర నుంచి విన్నా దూరం నుంచి విన్నా అలా వినినందు వలన విన్నవ్యక్తి యొక్క పాప రాశి కొండంతైనా దహింపబడుతుందని చెప్పాడు. అంతేకాదు. యమునికి 'అంతకుడు' అని పేరు. మార్కండేయుని రక్షించిన శివుడు 'అంతకాంతకుడు' అని కాబట్టి శివ నామ స్మరణ ముక్తిమార్గమని శాస్త్రాలు, పండితులు పేర్కొన్న విషయాన్ని ధూర్జటి గుర్తు చేశాడు.

శివ నామ జపము కల్యాణ కారకమని దీనిని తెలుసుకోలేని మానవుడు మూఢ విశ్వాసాలతో గ్రహ దోషాలని, అపశకునాలని అంటూ వాటిని తొలగించుకోడానికి ఏవేవో పాట్లు పడుతుంటాడని ఆక్షేపిస్తూ

గ్రహ దోషంబులు, దుర్నిమిత్తములు నీ కల్యాణ నామంబు ప్ర
త్యహముం బేర్కొను నుత్తమోత్తములు బాధం బెట్టగా నోపునే
దహనం గప్పగ జాలునే శలభ సంతానంబు నీ సేవ చే
సి హతక్లేశులు గారుగాక మనుజుల్ శ్రీకాళహస్తీశ్వరా అని అంటాడు.

"శ్రీకాళహస్తీశ్వరా! నీ శుభ నామమును ప్రతిరోజూ జపించే మంచివాళ్ళకు దుష్టగ్రహ పీడలు, దుశ్శకునములూ బాధించగలవా? మిడతలు ఎన్ని కలిసిననూ అగ్నిని ఆర్పగలవా? మానవులు నిన్నుపూజించి కష్టాలను ఎందుకు తొలగించుకోరో!?" అని ధూర్జటి మానవుల గ్రహాది నమ్మకాలను అపహాస్యం చేస్తూ, శివనామ జపం అగ్నియై గ్రహదోష, దుర్నిమిత్తాలనే శలభాలను దహిస్తుందని చెపుతా డు.

అనంతమైన ఈశ్వరుని మహిమను సమగ్రంగా చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. శివ నామ స్మరణ చేస్తూ శివుని చేరడమే జీవుని యొక్క పరమగమ్యమని ధూర్జటి పేర్కొన్నాడు. శివనామ స్మరణ మహత్వ పూర్ణమైనదని శ్రీకాళహస్తీశ్వరుని స్మరణ మాత్రం చేత నరకద్వార కవాటములు మూతపడతాయని, జీవుల అంత్యకాల ఘోషనమొనర్చే చిత్రగుప్తుని నాలుక అనెడి సర్పమునకు వైనతేయుడని (గరుత్మంతుడని ), మృత్యువు నోటి కోరలనెడి పర్వతభంజనమొనర్చే వజ్రాయుధమని పేర్కొంటూ..

కాల ద్వార కవాట బంధనము దుష్కాల ప్రమాణ క్రియా
లీలాజాలక చిత్రగుప్తముఖ వల్మీకోగ్ర జిహ్వాద్భుత
వ్యాళ వ్యాళ విరోధి మృత్యుముఖ దంష్ట్రాహార్య వజ్రంబుది
క్చేలా లంకృత నీదు నామ మరయన్ శ్రీకాళహస్తీశ్వరా' అని అంటాడు.

పై విధంగా శ్రీకాళహస్తీశ్వర శతకంలో శివ నామమహత్మ్య విశేషాలను వివరించిన ధూర్జటి "శ్రీకాళహస్తీశ్వరా ! నీ పదాంబుజములన్ దంతంబుల్ పడనప్పుడే, తనువునందారూఢి ఉన్నప్పుడే, కాంతా సంఘము రోయునప్పుడే, జరాక్రాంతంబు కానప్పుడే, వింతల్ మేనన్ చరించునప్పుడే, కురుల్ వెల్వెల్ల కానప్పుడే చింతించాలని భావించి తన ఆత్మనివేదనని శ్రీకాళహస్తీశ్వరునికి సమర్పించిన ధన్యజీవి. అందుకే శివనామ మాహాత్మ్యాన్ని పేర్కొన్న శివభక్తి కవులలో మేటిగా, తనకు తానే సాటిగా ధూర్జటి సాహిత్యచరిత్రలో చిరకీర్తిని పొందాడు.


**విల్లూరి. అప్పల సత్యనారాయణ**

ఆంధ్రోపన్యాసకులు

తెలుగు అధ్యాపకుడు,

శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

ఎలమంచిలి

అనకాపల్లి జిల్లా

92472 31382



ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

2) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి

3) శ్రీ కాళహస్తీశ్వర శతకము - పావని పబ్లికేషన్స్, హైదరాబాద్.